మన్యసీమలో మత్స్యసిరులు



రిజర్వాయర్‌లో లభించిన చేప (ఫైల్)



అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో చేపల వేట

- చేపల పెంపకంతో ఉపాధి అవకాశం
- జలాశయాల్లో మొదలైన వేట

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా గల మైనర్ ఇరిగేషన్ సాగునీటి చెరువులు, జలాశయాల్లో చేపల పెంపకం జోరుగా జరుగుతోంది. గిరిజన మత్స్యకారులకు ఇది ప్రధాన జీవనోపాధిగా మారింది. మండలంలోని అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో చేపల వేట ప్రారంభమైంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేప పిల్లలతో పాటు సొంతంగా వివిధ రకాల చేప పిల్లలను కొనుగోలు చేసి రిజర్వాయర్‌లో పెంచుతున్నట్టు స్థానిక మత్స్యకారులు నూకరాజు, పోతురాజు, సోమరాజు తదితరులు చెబుతున్నారు. అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో సుమారు 200 ఎకరాల గర్భం (క్యాచ్‌మెంట్ ఏరియా) గల వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిధిలో కొంత మేర ప్రదేశంలో చేపల పెంపకం సాగుతోంది.

వట్టిగెడ్డలో 2లక్షల చేప పిల్లలు

ప్రతి ఏటా రిజర్వాయర్‌లో గడ్డిచేపపిల్లలు, బిగ్ బాస్, రోహు, కట్ల, బంగారుతీగ(చైనా చేప) తదితర రకరకాల రెండు లక్షలకు పైగా చేప పిల్లలను వేస్తు న్నామని గిరిజన మత్స్యకారులు చెబుతున్నారు. చెరువు గర్భంలో వరదలకు కొట్టుకొచ్చిన భారీ చెట్లు, ఇతరత్రా చెత్త తొలగించకపోవడంతో చేపల వేటకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో పూడిక తీత చేపడితే చేపల పెంపకంతో పాటు సుమారు 3ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు కూడా సక్రమంగా లభిస్తుందని, యంత్రాంగం మరింత ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు. గత రెండేళ్లుగా చేపల ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం చేపపిల్లలు పెరిగి రెండు కిలోల నుంచి ఐదు కిలోల బరువు తూగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో చేప సైజు బట్టి రూ.150 నంచి ధర ఉందని, లాభాలు వస్తాయని ఆశిస్తున్నారు.

గ్రామాల్లో చేపల పెంపకం

మండలంలోని గ్రామాల్లోను వందకు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. ముఖ్యంగా గింజర్తి, కింద్ర, కొత్తకింద్ర, లబ్బర్తి, సింగంపల్లి, దూసరపాము తదితర గ్రామాల్లో ఉన్న పెద్ద పెద్ద చెరువుల్లో మత్స్యకార సంఘాల సభ్యులు చేపల పెంపకం చేపడుతున్నారు. ప్రధాన స్లూయిజ్ నుంచి చేపలు తప్పించుకొని పంట కాలువలోకి, రిజర్వాయర్ నుంచి సర్‌ప్లస్ ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నారు. అధిక వర్షాలు వచ్చినపుడు వరదపోటుకు జలాశయాల్లోని సర్‌ప్లస్ ప్రాంతాల్లో ఉన్న చేపలు దిగువకు పోవడంతో నష్టం చవి చూస్తున్నామని సంఘానికి చెందిన మత్స్యకారులు చెబుతున్నారు. చేపలు పట్టేందుకు అధునాతన యంత్రాలు అందించాలని, మరింత మార్కెటింగ్‌కు యంత్రాంగం ప్రోత్సాహమందించాలని కోరుతున్నారు. పల పెంపకం పెరిగితే ఉపాధి అవకాశాలతో పాటు గ్రామాల్లో పౌష్టికాహార లోపాలు కూడా తగ్గుముఖం పడతాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్థికాభివృద్ధికి దోహదం



ప్రభుత్వం వ్యక్తిగత చెరువులు ఉన్న రైతులకు, అలాగే సాగునీటి వనరుల్లో చేపలు పెంచేందుకు 75 శాతం సబ్సిడీపై చేపపిల్లలు అందజేస్తోంది. రాజవొమ్మంగి, పందిరిమామిడి ప్రాంతాల్లోని గిరిజన మత్స్యకారులకు 8 లక్షల ఫింగర్‌లింగ్స్ (చేపపిల్లలు) అందజేశాం. డివిజన్‌లోని జలాశయాల మత్స్యకార సంఘాలకు సుమారు 4 లక్షల 60వేలు చేపపిల్లలు పంపిణీ చేశాం. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద చేపల రవాణాకు వాహనాల కొనుగోలు, దుకాణాల ఏర్పాటుకు బ్యాంకు రుణాలు కల్పిస్తుంది. మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి. చేప పిల్లల పెంపకం గిరిజనుల ఆర్థికాభివృద్ధి దోహదపడుతోంది.

– సీహెచ్.రమేష్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, రంపచోడవరం

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి



ఎమ్మెల్సీ ప్రచారంలో పాల్గొన్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్యరాస వెంకటలక్ష్మి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు ఎం. వెంకటలక్ష్మి ఆదివారం మండలంలో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. అర్హులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎల్.నర్సింహమూర్తి, శేఖర్, కోటిబాబు, రామచంద్రుడు, కాశేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో దివంగత కర్రి రామునాయడు విగ్రహం వద్ద ఆయన తీర్థం సోమవారం నిర్వహించనున్నట్లు కర్రి మల్లికార్జునరావు, నాగమణి దంపతులు ఆదివారం తెలిపారు. ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం, ఆలయం వద్ద అన్నసమారాధన, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు గృహ సారథుల సమావేశం

గంగవరం : ఏటిపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎ.అప్పలరాజు, గ్రామ సచివాలయ కన్వీనర్ ఎం.శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో సోమవారం ఉదయం 10గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి



సీతగుంట గ్రామ సమీపంలో మహిళ మృతదేహం

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీలో మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఓ మహిళ ఆదివారం గ్రామ సమీపంలో మృతి చెందినట్టు స్థానిక వీఆర్వో కాతారి సత్యారావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆమె ఏడాదిగా ఇక్కడ ఉంటోందని చెప్పారు. మహిళ మృతిపై పోలీసులకు సమాచారం అందించామని, పంచనామా నిర్వహించి గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించామని తెలిపారు. సీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు,ఎంపీటీసీ కె.బొంజుబాబు, వైఎస్ సర్పంచ్ గంగాధరం, అశోక్‌కుమార్ సహకరించారని చెప్పారు.

విద్యతోనే ఉన్నత భవిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: మండలంలోని బాలికల పాఠశాల, కళాశాలను ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. విద్యార్థులకు చైల్డ్ పోర్నోగ్రఫీ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత భవిత ఉంటుందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గో దాహం తీరింది



మండల కేంద్రంలో కుళాయి వద్ద దాహం తీర్చుకుంటున్న మూగజీవి

గూడెంకొత్తవీధి: ప్రస్తుతం ఏజెన్సీలోనూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఎండ వేడిమికి మూగజీవాలు సైతం అల్లాడుతున్నాయి. దాహం తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. మండల కేంద్రంలో ఓ మంచినీటి కుళాయి నుంచి పడుతున్న నీటి చుక్కలతో దాహం తీర్చుకునేందుకు ఓ మూగజీవి ఆరాటపడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

నూకాంబిక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మ వారి కొత్త అమావాస్య ఉత్సవాల గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. వేగి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగాదేవిపేటలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ వేగి వెంకటఅప్పారావు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 19 నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ధర్మకర్త వేగిరామరాజు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాలరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

హుకుంపేట: మండలంలోని బారమసి పంచాయతీ నీలంపుట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు(సర్పంచ్ పుష్పలమ్మ బంధువు) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడు తూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ గ్రామానికి చేరుకొని బాలరాజు మృతదేహానికి ఎమ్మెల్యే పాల్గుణ నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ వర్తన ఈశ్వరమ్మ, మండల పార్టీ కన్వీనర్ భూషణ్, నాయకుడు మత్స్యరాజు తదితరులున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న శివప్రసాద్

కొయ్యూరు: అంతాడ పంచాయతీ తాటిమానిపాలెం అగ్నిబాధిత కుటుంబాలకు నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ అండగా నిలిచారు.ఆయన ఆదివారం బాధితులను పరామర్శించారు. ఈ మేరకు ఆయన రూ.రెండు లక్షలతో బాధితులు నివాసం ఉండేందుకు తాత్కాలికంగా రేకుల షెడ్లను నిర్మించి ఇస్తామన్నా రు. వెంటనే పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. శివప్రసాద్‌కు రుణపడి ఉంటామన్నారు. బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు అనేక మంది దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు. సర్పంచ్ సుర్ల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ



విద్యార్థులకు అందజేసిన బ్యాగ్‌లు

జి.మాడుగుల: మండలంలోని నేరేడుబంద గ్రామంలోని విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేశారు. పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఇటీవల నేరేడుబంద గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడి విద్యార్థుల కాళ్ళకు చెప్పులు లేకపోవటం, చిరిగిపోయిన బ్యాగులను గమనించి, దీనిపై వాకబు చేయగా విద్యా కానుక కిట్లు ఇవ్వలేదని చెప్పారు. దీంతో ఐటీడీఏ పీవో ఎంపీడీవో, విద్యాశాఖ అధికారితో మాట్లాడి తక్షణమే విద్యార్థులకు విద్యా కానుక కింద బ్యాగ్‌లు, షూలు అందించాలని ఆదేశించారు. పాఠశాలలో చదువుతున్న 9మంది విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఎం నాయకులు గోవిందరావు, పొట్టిదొరలు పీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

మోదకొండమ్మ పాదాలు తీర్థం పోస్టర్ విడుదల

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు వర్తక సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు అమ్మవారి ఆలయంలో ఆదివారం వారు తీర్థం పోస్టరు విడుదల చేశారు. రేస్ గుర్రాలు, పరుగు పందెంతోపాటు, విద్యుత్ లైటింగ్, నేలవేషాల నడుమ తీర్థం వైభవంగా నిర్వహించడానికి కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు పుట్టా బలరామ్, కోట్ని సత్తింబాబు, పి. కొండలరావు, పి.నాని, యన్నంశెట్టి వెంకటరావు, ఎస్. నాగేశ్వరరావు, శంకర్, వాసు పాల్గొన్నారు.

సాగుపై రైతులకు సూచనలు



అవగాహన కల్పిస్తున్న లయ సంస్థ ప్రతినిధి కోటేశ్వరరావు

రంపచోడవరం: వాతావరణ మార్పులపై ఆదివాసీ రైతులకు లయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శిక్షణలో మారేడుమిల్లి, వై.రామవరం మండలాలకు చెందిన ఐదు పంచాయతీల నుంచి వచ్చిన 35 మంది రైతులు పాల్గొన్నారు. లయ సహజ వనరుల యాజమాన్య విభాగం కింగుమహంతి కోటేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు సకాలంలో కురవని వర్షాలు, భూసారం తగ్గడం దిగుబడులు నిలకడగా లేకపోవడం, పంటలకు పశువులు, అడవి జంతువులు చేస్తున్న నష్టం వల్ల ప్రతి సంవత్సరం సకాలంలో ఆదివాసీ రైతులు వార్షిక పంటలు వేయడం తగ్గిపోతుందన్నారు. గత పదిహేను, ఇరవై సంవత్సలరాల నుంచి ఏజెన్సీ వాసులు సాగు చేసే పంటలు మారిపోయాయి, కొన్ని రకాల పాతపంటలు అయిన కొర్రలు, సామలు, గంటెలు, ఊదలు, నువ్వులు, పప్పు దినుసులు ముఖ్యంగా కొండకంది, ఉలవలు, బొబ్బర్లు వంటి పంటలు కనుమరుగైనట్టు చెప్పారు. ప్రస్తుతం కొండపోడు, మెట్టగరువులు, గరువుల భూముల్లో ఉద్యాన వన పంటలైన జీడి, మామిడి, జాఫ్రా పంటలు విస్తీర్ణం పెరిగిందన్నారు. కూరగాయల సాగు విస్తీర్ణం చాలా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితులలో ఆదివాసీల వ్యవసాయం పూర్వ వైభవం తీసుకురావడానికి యువత వ్యవసాయంపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలలో ఆదివాసీ యువతను ఎంపిక చేసి వ్యవసాయ కోర్సులను తయారుచేసి శిక్షణలను ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ మూడురోజుల షార్ట్ టెర్మ్ వ్యవసాయ కోర్సు ట్రైనింగ్ ప్రోగ్రాంను లయ సంస్థ నిర్వహించినట్టు చెప్పారు. ఉద్యానవన పంటలలో అంతర పంటల సాగు, చిరు ధాన్యాల సాగు పద్ధతులపై కేవికే శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ చిరంజీవి రైతులకు వివరించారు. ఒక ఎకరానికి 14 క్వింటాళ్లు దిగుబడి సాధించిన పోదిలి గ్రామం రైతుల కేస్ స్టడీని రైతుల శిక్షణలో వివరించారు.

నేడు భజన పోటీలు

పెదబయలు: మండల కేంద్రంలోని భీమలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు రెండో తేదీన జరగనున్నట్టు టీటీడీ మండల కో-ఆర్డినేటర్ సోభ ప్రియంక, లకే వెంకటరత్నం చెప్పారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి భజన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. హరిహర పుత్ర అయ్యప్ప పీఠంలో జరగనున్న పోటీల్లో 15 భజన బృందాలు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు జాతర ఉత్సవాల రోజున బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. జట్లు సమయానికి హాజరు కావాలని కోరారు. కోశాధికారి వంతినిభ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి కించేయి చలపతి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి దర్శనం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి మూలవిరాట్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి గర్భగుడి దర్శనం ఆదివారం నుంచి భక్తులకు కల్పించినట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ చెప్పారు. ఈ నెల 22 నుంచి 25 వరకు కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు రంగులు వేశారు. దీంతో దర్శనాలను నిలిపేశారు. పనులు పూర్తి కావడంతో దర్శనాలకు అనుమతించారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈవో తెలిపారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం



ఆనంద మేళాను ప్రారంభించిన ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

రోలుగుంట: కొవ్వూరులో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం కోలాట పోటీలు, రాత్రికి ఆర్కెస్ట్రా, భాగవతం, గ్రూపు డ్యాన్సు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా పురవీధుల్లో నేల డ్యాన్సు, బాణసంచా పేలుళ్ల మధ్య ఉత్సవమూర్తులను ఊరేగించారు. సోమవారం స్థానిక చెరువులో నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ తెలిపారు.

కొండచీపుళ్లకు గిరాకీ

- అటవీ ప్రాంతాల్లో సేకరిస్తున్న గిరిజనులు
- చీపురు కట్ట రూ.40 నుంచి 60లకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఆశాజనకంగా లాభాలు



సంతకు ఆటోలో తరలిస్తున్న చీపుళ్లు



కొండచీపుళ్ల సాగు

అనంతగిరి: గిరిజన ప్రాంతంలో దొరికే కొండచీపుళ్లకు మైదాన ప్రాంతాల్లో విపరీతంగా డిమాండ్ ఉంది. అటవీ ప్రాంతాల్లో లభ్యమయ్యే నాణ్యమైన చీపుళ్లకు మంచి ధరలు పలుకుతున్నాయి. దీంతో గిరిజన మహిళలు, పురుషులు సమీప అటవీ ప్రాంతాల నుంచి చీపుళ్ల సేకరిస్తున్నారు. ప్రయాసానికి ప్రస్తుతం గిట్టుబాటు ధరతో విక్రయాలు జరుగుతుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు తమ సమీపంలోని అడవుల్లో చెట్ల నుంచి సేకరిస్తారు. ఇందులో కాయలు, నారను తొలగిస్తారు. వాటిని బాగా ఎండబెడతారు. అనంతరం చీపుళ్లను కట్టలుగా కట్టి విక్రయిస్తారు. సేకరించిన నారను నీటిలో నానబెడతారు. అనంతరం ఎండబెట్టిన నారను చీపుళ్లకు కడతారు.

వారపు సంతల్లో అమ్మకాలు

మండలంలోని ప్రధాన వారపు సంతల్లో కొండ చీపుళ్ల భారీగా అమ్మకాలు జరుగుతాయి. బుధవారం జరిగే దముకు, కాశీపట్నం వారపు సంత, సోమవారం జరిగే అనంతగిరి వారపు సంతల్లో సమీప గ్రామాల నుంచి గిరిజనులు సేకరించిన కొండచీపుళ్లను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అనంతగిరి, డెక్కాపురం, తేనెపుట్టు, తలారీపాడు, రేగం, లక్ష్మీపురం, పెదబిడ్డ, గుమ్మ పంచాయతీల్లో నుంచి అధిక సంఖ్యలో వారపు సంతలకు కొండచీపుళ్లు తీసుకొస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వారపు సంతలో చీపురు కట్ట సైజును బట్టి రూ.40 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు.

గ్రామాల్లో కొండచీపుళ్ల సాగు

డుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో విస్తారంగా కొండచీపుళ్లను సాగు చేస్తున్నారు. కొండచీపుళ్లకు గిట్టుబాటు ధరలు వస్తుండడంతో గిరిజనులు పోడు భూముల్లో సాగు చేస్తున్నారు. నాలుగైదు నెలల్లో పంట చేతికందడంతో వాటిని సేకరించి, శుభ్రపరచి, కట్టలుగా చుట్టి సంతల్లో విక్రయిస్తున్నారు. పెదఅంజోడ, కాగువలస, అడ్రగుడ పోడు భూముల్లోని ఊట ప్రదేశాల్లో సాగు చేస్తున్నారు. ధరలు బాగుండంతో లాభాలు వస్తున్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు.

డిమాండ్ ఉంది



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కొండచీపుళ్లకు మంచి డిమాండ్ ఉంది.. అడవుల్లో సేకరించి, వారపు సంతలకు తెచ్చిన వెంటనే అమ్ముడుపోతున్నాయి. ప్రయాసానికి గిట్టుబాటు కలుగుతుంది.

– కిల్లో ప్రసాద్, డెక్కాపురం, గిరిజనుడు

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. విశాఖ, తుని, రాజమహేంద్రవరం, అనకాపల్లి, నర్సీపట్నం పట్టణాలతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. కొత్తగా వివాహం చేసుకున్న 50 జంటల వరకు వారి బంధువులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండుగలు నిర్వహించడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తప్పలరాజు, మాజీ సర్పంచ్ సూర్యారావు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

తుమ్మపాల : అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ వాసవీ కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి వ్రతాలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఉత్సవ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంతిపూరి శ్రీనివాస్, కనకా మధుసూదన రావు, నూతన హరిశంకర్, ప్రదీప్, సునీల్, తులసీరావు, సంతోష్, శ్రీదత్తు, ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బల్లల పండగ

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి, ఉపమాక తదితర గ్రామాల్లో రజకులు ఆదివారం బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి అనంతరం రజకులు ఈ బల్లల పండగను చేసుకోవడం ఆనవాయితీ. ఈ పండగ నిర్వహిస్తే తప్ప వారు తమ చేతి వృత్తిని కొనసాగించే పరిస్థితి ఉండదని నమ్మకం. శక్తి వేషాలు, నేల డ్యాన్సులు చేస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కానుకలు, విరాళాలు అందించారు.